

ఉత్సాహంగా ఏపీఎల్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్‌లో మూడో రోజు రాయలసీమ కింగ్స్‌పై వైజాగ్ వారియర్స్, గోదావరి టైటాన్స్‌పై ఉత్తరాంధ్ర లయన్స్ విజయం సాధించాయి.



నేత్రపర్వం.. నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని మంగళవారం విశేషంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.8/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

ప్రజల కోసం సిద్ధం చేసిన ఇసుక అది. గత ప్రభుత్వం గృహనిర్మాణ లబ్ధిదారులకు ఉచితంగాను, ఇతరులకు నామమాత్రపు ధరలకు సరఫరా చేసేది. నక్కపల్లి వద్ద ఏర్పాటు చేసిన డిపోలో నిల్వ ఉంచిన కోట్లాది రూపాయల విలువైన ఇసుకపై ఇప్పుడు మాఫియా కళ్లు పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వ పెద్దల సహకారంతో తరలించుకుపోయేందుకు స్కెచ్ వేసినట్టు సమాచారం. స్థానికులు సాహసించి అడ్డుకోవడంతో వారి ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి.



నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక నిల్వలు

పడగవిప్పిన ఇసుక మాఫియా

- చీకట్లో తరలించేందుకు సన్నాహాలు
- స్థానికులు అడ్డుకోవడంతో అక్రమార్కులకు బ్రేక్
- నక్కపల్లి డిపో వద్ద వేలాది టన్నుల నిల్వలు
- విలువ రూ.1.50 కోట్లు పైమాటే..
- ప్రభుత్వంలోని కొందరు పెద్దల ప్రోద్బలంతోనే ఇసుకను మాయం చేసేందుకు యత్నాలు

నక్కపల్లి: ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకుని మాఫియాకు కళ్లెం వేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తూ ఇసుకను ప్రభుత్వమే ప్రజలకు విక్రయించేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇసుక డిపోను ఏర్పాటు చేసింది. రాజమండ్రి గోదావరి నది నుంచి ఇసుకను తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేసి కాంట్రాక్ట్ దక్కించుకున్న ప్రైవేటు సంస్థ ద్వారా ఇసుక విక్రయాలు చేపట్టింది. ప్రభుత్వ చర్యల వల్ల గడచిన ఐదేళ్లు లబ్ధిదారులకు ఇసుక కొరత రాలేదు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి టన్ను రూ.1400లకు విక్రయించారు. ఐదేళ్లపాటు ఇక్కడ ఇసుక డిపో సాఫీగానే జరిగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నక్కపల్లి డిపో వద్ద ఇసుక విక్రయాలు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం ఈ డిపోలో సుమారు 8 వేల నుంచి 10 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఇక్కడ ఇసుకను స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులు సుమారు 30 లారీల్లో తరలించుకుపోయినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు ఇసుక నిల్వల వద్దకు వెళ్లకుండా చుట్టూ ట్రెంచ్ తవ్వించారు.

పెద్దల అండతోనే..

ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యాలు కూడా మారాయి. గతంలో ప్రజలకు సక్రమంగా సరఫరా చేసేందుకు తపన పడితే.. ఇప్పుడు అక్రమార్కులకు కొమ్ములు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇసుకపై కొంతమంది పెద్దల కళ్లు పడ్డాయి. వేల టన్నుల ఇసుకను రాత్రి పూట మాయం చేసేందుకు స్కెచ్ వేశారు. మంగళవారం విజయవాడకు చెందిన కొంతమంది మాఫియా నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక నిల్వలను రాత్రికి రాత్రే తరలించుకుపోవడానికి ప్రయత్నించారు. జేసీబీలను తీసుకు వచ్చి తవ్వకాలు జరిపి లారీల్లో లోడ్ చేసేందుకు తాత్కాలికంగా మార్గం ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రభుత్వంలో ఉన్న కొంతమంది పెద్ద నేతల ప్రోద్బలంతోనే నక్కపల్లి డిపోలో ఉన్న ఇసుకను విజయవాడ తరలించి అక్కడ విక్రయించి కోట్లు సంపాదించేందుకు సన్నాహాలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇసుకకు గిరాకీ ఎక్కువగా ఉంది. ట్రాక్టర్ ఇసుక (5 టన్నులు) సుమారు రూ.6 వేలకు పైబడే ఉంది. ఈ లెక్కన వేల టన్నుల్లో ఇక్కడ ఉచితంగా లభిస్తున్న ఇసుకను కోట్లాది రూపాయలకు విక్రయించి అక్రమంగా కోట్లు సంపాదించుకునేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఇసుక తరలిపోకుండా మైనింగ్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుక విలువ సుమారు రూ.1.50 కోట్లు పైబడే ఉంటుందని తెలుస్తోంది. ఇసుకను తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై సీఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా నక్కపల్లి డిపో వద్ద ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం రావడంతో పోలీసులను పంపించామన్నారు. దాంతో అక్కడ నుంచి సదరు వ్యక్తులు వెళ్లిపోయారన్నారు. ప్రస్తుతం ఇసుక డిపో వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇసుక తరలించేందుకు ఉపయోగించిన వాహనాలు, జేసీబీ ఎవరిదనే విషయంపై విచారణ జరుపుతున్నామన్నారు. ఇసుకను తరలించకుండా ట్రెంచ్ తవ్వించామని చెప్పారు.



మంగళవారం రాత్రి ఇసుక తరలించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్త కలెక్టర్ కె.విజయ

- రవి పట్టన్‌శెట్టికి బదిలీ



సాక్షి, అనకాపల్లి: జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి బదిలీ అయింది. ఆయన స్థానంలో ప్రస్తుత సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కె.విజయను కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కె.విజయ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్‌గా, ఉమ్మడి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, ఏపీ టూరిజం సీఈఓగా, ఏడాదిపాటు బాపట్ల కలెక్టర్‌గా పనిచేశారు. బాపట్ల జిల్లా తొలి కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4 నుంచి 2023 ఏప్రిల్ 14 వరకు విధులు నిర్వహించారు. రవి పట్టన్‌శెట్టికి ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

ఆదర్శ ఐఏఎస్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్‌గా కె.విజయ రాజమండ్రిలో పనిచేస్తున్న సమయంలో ఆమె భర్త, ఇటీవల అల్లూరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన దినేష్‌కుమార్ రంపచోడవరంలో ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించేవారు. ఆ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమె రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ రోగుల మాదిరి పురుడు పోసుకొని ఆదర్శంగా నిలిచారు. ప్రజలను చైతన్యపరుస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందనే మనోధైర్యాన్ని కల్పించారు. ఐఏఎస్ దంపతులిద్దరూ ఆదర్శ కలెక్టర్లుగా పేరు తెచ్చుకున్నారు. కె.విజయ టూరిజం విభాగంలో పనిచేసిన సమయంలో అరకు బెలూన్ ఫెస్టివల్ నిర్వహణలో కీలకపాత్ర పోషించడమే కాకుండా 2019లో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పూతరేకులు, 15 అడుగుల లాంగెస్ట్ బాంబూ చికెన్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించడంలో కీలక పాత్ర పోషించారు.

తొలి కలెక్టర్‌గా తనదైన ముద్ర



2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రవి పట్టన్‌శెట్టి నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా తొలి కలెక్టర్‌గా తనదైన ముద్ర వేశారు. ఆయన 2022 ఏప్రిల్ నెల 4వ తేదీన నియమితులయ్యారు. ఆయన హయాంలో నూతన జిల్లా యంత్రాంగం రూపుదిద్దుకుంది. వివిధ విభాగాల కార్యాలయాల ఏర్పాటుతోపాటు వాటి పనితీరు గాడిలో పడేలా కృషి చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను టాప్‌లో నిలిపారు. అన్ని శాఖల సమన్వయంతో సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు.

పరిపాలన దక్షతకు డాక్టరేట్

రవి పట్టన్‌శెట్టి పరిపాలన దక్షతకు గౌరవ డాక్టరేట్ లభించింది. పెట్రోలియం అండ్ ఎనర్జీ యూనివర్సిటీ నుంచి ఆయన తొలి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఐటీడీఏ పీవో, జేసీ, కలెక్టర్‌గా గిరిజనులకు అందించిన సేవలు, చక్కని కార్యదక్షతలకు గౌరవ డాక్టరేట్ దక్కింది. అనకాపల్లి కలెక్టర్ హోదాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 'స్వస్థ భారత్' పురస్కారం అందుకున్నారు. సబ్బవరం వంగలి గ్రామంలో పెట్రో యూనివర్సిటీ నిర్మాణానికి 20 ఎకరాల విషయంలో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రవి పట్టన్‌శెట్టి నిర్వాసితులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

న్యూస్‌రీల్

రేపు అల్లూరి జయంతి



అల్లూరి పార్కులో సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో జయరాం

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఈనెల 4న ఏఎల్ పురం (కృష్ణదేవిపేట) పార్కులో ఘనంగా నిర్వహించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. ఆయన మంగళవారం మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో ఉన్న అల్లూరి సమాధుల వద్ద శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాళులర్పిస్తారని తెలిపారు. జయంతి సందర్భంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరితో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత కమిటీలు

- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ అనంతలక్ష్మి

అనకాపల్లి : లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2013ని జిల్లాలో డివిజినల్, మున్సిపల్, మండల స్థాయి అధికారులతో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.అనంతలక్ష్మి ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేసే మహిళలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టాన్ని అమలు చేయాల్సిందేనన్నారు. పది లేదా అంతకన్నా ఎక్కువ ఉద్యోగులు పని చేసే చోట అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ వివరాలను మహిళ, శిశు సంక్షేమ కార్యాలయానికి అందించాలన్నారు. ప్రతి నెల శాఖల వారీగా నివేదికలు అందజేయాలని కోరారు. అన్ని కార్యాలయాల వద్ద ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలపై రూ.50 వేలు వరకు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో పథక సంచాలకులు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ): పూరీ రథయాత్ర సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు పూరీకి నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెలలో పూరీలో గుండిచా యాత్ర, బహుదా యాత్ర, సునాబేష సందర్భంగా ఈ రైళ్లు ఆయా ప్రాంతాల నుంచి పూరీకి నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

- గుణుపూర్–పూరీ(08345) స్పెషల్ (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) ఈ నెల 4, 14, 16వ తేదీల్లో గుణుపూర్‌లో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.15 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–గుణుపూర్ (08346) స్పెషల్ ఈ నెల 7, 15, 17వ తేదీల్లో రాత్రి 9.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది.
- పలాస–పూరీ(08331) (వయా హరిపూర్ గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 7, 15, 17వ తేదీల్లో పలాసలో మధ్య రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదే రోజు తెల్లవారు 5.35 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–పలాస(08332) స్పెషల్ ఈ నెల 8, 16, 18వ తేదీల్లో తెల్లవారు 4 గంటలకు పూరీలో బయల్దేరి అదే రోజు ఉదయం 10 గంటలకు పలాస చేరుకుంటుంది.
- విశాఖపట్నం–పూరీ (08347) (వయా హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ విశాఖపట్నంలో ఈ నెల 6, 14, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.45 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–విశాఖపట్నం (08348) స్పెషల్ పూరీలో ఈ నెల 8, 16, 18వ తేదీల్లో రాత్రి(తెల్లవారు) 1.45 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.



- జగదల్‌పూర్–పూరీ (08349) (హరిపూర్‌గ్రామ్, అర్గుల్) స్పెషల్ ఈ నెల 6, 14, 16వ తేదీల్లో ఉదయం 10.45 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 12.45 గంటలకు పూరీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూరీ–జగదల్‌పూర్ (08350) స్పెషల్ పూరీలో ఈ నెల 8, 16, 18వ తేదీల్లో రాత్రి 12.15 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 3.10 గంటకు జగదల్‌పూర్ చేరుకుంటాయి.

పలు రైళ్లకు అదనపుకోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 4 నుంచి విశాఖపట్నం–సాయినగర్ షిర్డీ(18503) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–జగదల్‌పూర్(18447) ఎక్స్‌ప్రెస్‌కు, ఈ నెల 5 నుంచి సాయినగర్ షిర్డీ–విశాఖపట్నం(18504) ఎక్స్‌ప్రెస్, జగదల్‌పూర్–భువనేశ్వర్(18448) ఎక్స్‌ప్రెస్‌కు, ఈ నెల 8 నుంచి విశాఖపట్నం–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22869) ఎక్స్‌ప్రెస్‌కు, ఈ నెల 9వ తేదీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–విశాఖపట్నం(22870) ఎక్స్‌ప్రెస్‌కు ఓ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్ చొప్పున జత చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఏకాగ్రతతో చదివితే విజయం మీదే..

సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్

కొమ్మాది: ఏకాగ్రత, సంకల్పంతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సొంతమవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కె.హర్షవర్ధన్ అన్నారు. రుషికొండలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అందుతున్న మౌలిక సౌకర్యాలు, కోచింగ్‌పై ఆరా తీశారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తోందని, ఈ అవకాశాలను ఉపయోగించుకుని ఉన్నతమైన స్థానాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. 2022–23 నుంచి ఇక్కడ శిక్షణ కొనసాగుతోందని.. ప్రస్తుతం జరుగుతున్న మూడవ బ్యాచ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో సుమారు 100 మందిని ఎంపిక చేశామన్నారు. వీరిలో 97 మంది కోచింగ్‌కు హాజరయ్యారని తెలిపారు. ఇటీవల విడుదలైన గ్రూప్–1లో 12 మంది, గ్రూప్–2లో 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయకృష్ణ, ఏపీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకుడు కె.రామారావు తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కన్వీనర్లు

సింహాచలం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి సింహాచలంలోని బీసీ గురుకుల పాఠశాలలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని తానాం, చోడవరం, అన్నవరం, పాయకరావుపేట బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి బుధవారం కౌన్సెలింగ్ ఉంటుందని విశాఖ జిల్లా కన్వీనర్, సింహాచలం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అనకాపల్లి జిల్లా కన్వీనర్, నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి, పెద్దనరవ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.నరసింహారావు, అనకాపల్లి ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో రైల్వే జీఎం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రైల్వే జనరల్ మేనేజర్ (భువనేశ్వర్) పరమేశ్వర్ ఫన్క్వాల్ సతీసమేతంగా దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

మెగా జాబ్‌మేళాలో 117 మంది ఎంపిక

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ నిర్మాణ సంస్థ ‘నిర్మాణ్’ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు 117 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ తెలిపారు. 12 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాలో 256 మంది ఉద్యోగార్థులు పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిలో అర్హతల మేరకు ఎంపికైన 117 మందికి నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్, సుధీర్‌లు నియామక పత్రాలను అందించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో వారు మాట్లాడుతూ ఇది తమ సంస్థ చేపట్టిన రెండో జాబ్ మేళా అన్నారు. ఎంపికైన అభ్యర్థులు అంకితభావంతో పనిచేసి ఉన్నత స్థాయికి చేరాలని అభిలషించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, సీనియర్ అధ్యాపకులు ఐవీవీ సత్యవతి, వెన్నెల అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వీవీ రత్నభారతి, బి.మాల్యాద్రి, బిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ యాప్‌లలో బిల్లులు చెల్లించలేరు!

- ఫోన్‌పే, జీ పే, పేటీఎంలలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు బంద్
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చెల్లింపులకు అవకాశం
- అందుబాటులోకి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్

విశాఖ సిటీ: యూపీఐల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులకు షాక్ తగిలింది. థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐల ద్వారా నేరుగా చెల్లింపులకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు విద్యుత్ వినియోగదారుల్లో కొంతమంది బిల్లులను రెవెన్యూ కౌంటర్ల వద్ద చెల్లిస్తున్నారు. మరికొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా కడుతున్నారు. అత్యధిక వినియోగదారులు మాత్రం గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌లను వినియోగించి పేమెంట్ చేస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఈ యాప్‌ల ద్వారా చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటోంది. ఇకపై ఇలా చేయడం కుదరని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

ఆర్‌బీఐ స్పష్టమైన ఆదేశాలు

బిల్లుల చెల్లింపు ప్రక్రియలో ఇతరుల పాత్రపై ఆర్‌బీఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు జారీ చేసే వారు కాకుండా ఇతరులు బిల్లులను వసూలు చేయడంపై ఆంక్షలు విధించింది. ఆర్‌బీఐ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ తాజా మార్గదర్శకాల ప్రకారం ఇకపై నేరుగా ఇలా బిల్లుల వసూలు సాధ్యం కాదు. థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించాలంటే బిల్లు జారీ చేసిన వారి ధ్రువీకరణ అవసరం. ఈ మేరకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా భారత్ బిల్ డెస్క్ నుంచి పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్లకు సమాచారం అందింది.

ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్

నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) బిల్లుల చెల్లింపు విషయంలో కూడా సులభతరమైన పేమెంట్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్ నుంచే కాకుండా మొబైల్ యాప్‌ను కూడా రూపొందించింది. ఇప్పటికే వీటిని ప్రజలకు చేరువ చేసింది.

గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్

వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలనుకుంటే మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్లే స్టోర్‌లో eastern power అనే యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో అవసరమైన అనుమతులు ఇచ్చి నేరుగా సులువుగా బిల్లులు చెల్లించుకోవచ్చు. అలాగే వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలనుకుంటే www.apeasternpower.com ద్వారా పేమెంట్ చేసే అవకాశముంది. ఈ వెబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్ యాప్ ద్వారా గానీ బిల్లులు చెల్లించే సమయంలో వినియోగదారులు పేమెంట్ గేట్ వేగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులను కూడా వినియోగించుకునే సౌకర్యం ఉంది. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.



హెచ్‌ఎఫ్ ఆవుకు ఒకే కాన్పులో ఆడ, మగ దూడలు



తారువలో హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు ఒకే కాన్పులో జన్మించిన ఆడ, మగ దూడలు

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామంలో హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు ఒకే కాన్పులో రెండు లేగ దూడలు జన్మించాయి. గ్రామంలోని బూడి సూర్యనారాయణకు చెందిన హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు హెచ్‌ఎఫ్ బ్రీడ్‌తో క్రాసింగ్ చేయగా గర్భం దాల్చింది. మంగళవారం మధ్యాహ్నం ప్రసవించడంలో ఇబ్బంది పడటంతో స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ వి.రవీంద్ర, ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజూషరాణి వైద్య సేవలందించగా రెండు దూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. హెచ్‌ఎఫ్ జాతి ఆవుకు ఒకే కాన్పులో రెండు మగ లేదా రెండు ఆడ దూడలు జన్మించడం సాధారణమని, ఆడ, మగ దూడలు జన్మించడం మాత్రం అరుదుగా జరుగుతుందని పశువైద్యాధికారి తెలిపారు.

క్లుప్తంగా

శుద్ధి చేసిన తాగునీటితో ఫ్లోరోసిస్ దూరం



బాధితులకు వాకర్స్ పంపిణీ చేసిన ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రశాంతి

రోలుగుంట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గల ఫ్లోరోసిస్ ప్రభావిత గ్రామాల వారికి ఫ్లోరోసిస్ వల్ల ఏర్పడే నష్టాలు, వాటిని ఎలా గుర్తించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి జె.ప్రశాంతి అవగాహన కల్పించారు. శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలని, అలాగే ఆహార జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమం అనంతరం బాధిత గ్రామాల్లో అవసరమైన వారికి వాకర్స్, వాకింగ్ స్టిక్, ఇతర పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఫ్లోరోసిస్ కరస్పాండెంటు డాక్టర్ విశ్వనాథం, స్థానిక వైద్యురాలు కె.ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో 'టీచ్ టూల్' శిక్షణ కార్యక్రమం

చోడవరం రూరల్ : చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిది మండలాల ఉపాధ్యాయులకు తొమ్మిది రోజులపాటు ×టీచ్ టూల్¤ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కోర్సు డైరెక్టర్ ఐ.వి.రామిరెడ్డి ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమంలో సుమారు 100 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ బోధన నాణ్యతను మెరుగుపరిచేందుకు, ఉపాధ్యాయుల అవసరాలకు తగిన విధంగా ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణలో చోడవరంతో పాటు చీడికాడ, బుచ్చియ్యపేట, సబ్బవరం, కోటపాడు, పరవాడ, రావికమతం, దేవరాపల్లి , రావికమతం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఈఎన్‌సీ' మెడికల్ ఆఫీసర్‌గా అజిత్ గోపీనాథ్



సింధియా (విశాఖ) : తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయంలో సర్జన్, రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్ కమాండ్ మెడికల్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏఎఫ్ఎంసీ పుణె, టీఐఎస్ఎస్ ముంబయి, సీడీఎం సికింద్రాబాద్‌లో చదువుకున్నారు. నేవల్ హెడ్ క్వార్టర్స్‌లోని సీఏబీఎస్, ఏఎఫ్ఎంఎస్(సీఆర్‌డీ), డీజీఏఎఫ్ఎంఎస్, జేడీఎంఎస్, సీఎండీఈలో స్టాఫ్ ఆఫీసర్(మెడికల్)గా పనిచేశారు. ఐఎన్‌హెచ్ఎస్ పతంజలి, ఐఎన్‌హెచ్ఎస్ సంజీవనికి కమాండ్‌గా విధులు నిర్వర్తించారు.

పీజీ కుర్రాడు.. ప్రకృతి సాగులో ఘనుడు

సేంద్రియ వ్యవసాయంతో ఉపాధి పొందుతున్న గొన్నవానిపాలెం యువకుడు



పండిన బొప్పాయి పండ్లను సేకరిస్తున్న యువరైతు నాగేశ్వరరావు



జీవామృతాన్ని తయారు చేసుకుంటున్న నాగేశ్వరరావు



సేంద్రియ పద్ధతిలో నాగేశ్వరరావు సాగు చేస్తున్న పంటలు

బుచ్చెయ్యపేట: పల్లెటూళ్లో పుట్టిన పలువురు పట్టణ బాట పట్టి ఉపాధి పొందాలని తహతహలాడుతారు. అందుకు భిన్నంగా బుచ్చెయ్యపేట మండలం గొన్నవానిపాలెంకు చెందిన యువకుడు పినపోలు నాగేశ్వరరావు మాత్రం పీజీ చేసినా... తాను పుట్టిన ఊళ్లోనే భూమిని నమ్ముకుని రసాయనాలు వాడకుండా సేంద్రియ సాగు పద్ధతిలో పంటలు పండిస్తూ పలువురుకి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న పొలంలోనే ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఉపాధి చూపుతున్నాడు. పది రకాల పంటలు పండిస్తూ ఆర్థికాభివృద్ధిసాధిస్తున్నాడు. నాగేశ్వరరావు చిన్న తనం నుంచి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు. అందరూ పలు రకాల రసాయనాలు వాడి వాతావరణం కాలుష్యంతో పాటు పరాన్నజీవులను నాశనం చేయడాన్ని జీర్ణించికోలేకపోయాడు. ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న రసాయనాలను వాడకుండా మానవుని ఆయుష్షును పెంచేలా అడుగులు వేశాడు. రసాయనాలు,క్రిమి సంహారక మందులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ తన కుటుంబాన్ని హాయిగా పోషించికుంటున్నాడు.

పండించే పంటలు

నాగేశ్వరరావు తనకున్న రెండు ఎకరాల పొలంలోనే చాలా రకాల పంటలను కాలానుగుణంగా సాగు చేస్తున్నాడు. బీర,బెండ,వంగ, టమాటా, చిక్కుడు ,మొక్కజొన్న, అరటి,బొప్పాయి, కాకర, కీర, తోటకూర, గోంగూర, పాలకూర, మునగ, అరటి, సీతాఫలం, వేరుశెనగ, పువ్వులు,గోరుచిక్కుడు తదితర పంటలను పండిస్తున్నాడు. విత్తనాలను కూడా సొంతంగా తయారు చేసుకోవడంతో పాటు స్థానిక రైతుల వద్ద ఉన్న సాధారణ విత్తనాలను కొనుగోలు చేసి పంటలు పండిస్తున్నాడు.



ఇంటి వద్ద అమ్మకానికి ఉంచిన కూరగాయలు

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు

భూమిలో విత్తనం నాటినప్పటి నుంచి పంట పండి ఫలసాయం చేతికొచ్చి అమ్మేవరకు నాగేశ్వరరావు ఎటువంటి రసాయనాలు వినియోగించడం లేదు. పూర్వకాలంలో రైతులు సాగు చేసే విధానాన్ని ఎంచుకున్నాడు. గెత్తం,పచ్చిరొట్ట ఎరువులతో పాటు గోమూత్రం,బెల్లం,పులిసిన మజ్జిగ,నిమ్మరసం,నాటు కోడిగుడ్లతో చేసిన కషాయాలను, ఘన జీవామృతం,ద్రవ జీవామృతం,పంచగవ్య తదితర ద్రవాలను వినియోగించి ఆరోగ్యకరమైన పంటలను పండిస్తున్నాడు. తన పొలంలో పండించిన పలు రకాల పంటలను స్థానికంగా ఉన్న వడ్డాది, మాడుగుల, చోడవరం,బుచ్చెయ్యపేట సంతలకు తీసికెళ్లి అమ్మకాలు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువులతో నాగేశ్వరరావు పండించిన పలు రకాల పంటలను కొనుగోలు చేయడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. అన్ని రకాల పంటల ద్వారా రోజుకు రూ.మూడు వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నట్లు నాగేశ్వరరావు తెలియజేశాడు. పొలం పనుల్లో పలువురికి ఉపాధి చూపుతూ, ప్రకృతి వ్యవసాయం చేసేలా పలువురి రైతులని పోత్సహిస్తున్నాడు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆదాయం



పూర్వకాలంలో వంద కేజీల బస్తాను సులువుగా మోసేవారు ఆనాడు రసాయనాలు లేవు సేంద్రియ సాగు ద్వారా పండించిన పంటలు తినడం వల్ల ఆరోగ్యవంతులుగా బలంగా ఉండేవారు. అప్పటిలాగే ఈ తరం ప్రజలు తయారవ్వాలన్న సంకల్పంతో పీజీ చేసిన వ్యవసాయం వైపు మక్కువ చూపాను. కేవీకే శాస్త్రవేత్తలు,ప్రకృతి వ్యవసాయశాఖ అధికార్లు సూచనలతో రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ఆదాయం బాగుంది. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తే అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటాం.

– పినపోలు నాగేశ్వరరావు, గొన్నవానిపాలెం యువరైతు

అక్రమ ఇసుక తవ్వకాలపై అధికారుల కొరడా

- మూడు ఇసుక నిల్వల సీజ్
- మూడు ఎడ్లబళ్లకు అపరాధ రుసుం



పట్టుబడ్డ ఇసుక బళ్లతో మైన్స్ ఏడీ సుబ్బారాయుడు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చోడవరం : అక్రమ ఇసుక తవ్వకాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలో ముద్దుర్తి గ్రామ సమీపంలో శారదానది ఒడ్డున అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి ఇసుక కుప్పలు వేశారు. సమాచారం తెలుసుకున్న అనకాపల్లి మైన్స్ ఏడీ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కసారిగా దాడి చేశారు. బెల్లం పెనాలు, ఎడ్లబళ్లతో నదిలో ఇసుకను తవ్వకాలు చేసి లారీలతో అక్రమ రవాణా చేసేందుకు వీలుగా ఇక్కడ ఇసుక కుప్పలను వేశారు. ఇలా అక్రమంగా నది సమీపంలో మామిడి తోటలో తరలించడానికి స్టాక్ చేసి ఉంచిన మూడు ఇసుక కుప్పలను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తలిస్తున్న మూడు ఎడ్ల బళ్లపై కేసు నమోదు చేశారు. ఒక్కో బండికి రూ. 2వేలు చొప్పున మూడు బళ్లకు రూ.6వేల అపరాధ రుసుం విధించినట్టు ఏడీ తెలిపారు. ఇసుక కుప్పలు కలిగి ఉన్న మామిడి తోట యజమానికి నోటీసులు ఇచ్చామన్నారు. పట్టుబడిన ఇసుక బళ్లు మరోసారి ఇసుకతో కనిపిస్తే రూ.10వేలకు మించి అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న ఇసుక కుప్పలను సీజ్ చేసి చోడవరం రెవెన్యూ, పోలీసులు అధికారులకు అప్పగించారు. ఈ దాడిలో మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి, రెవెన్యూ ఆర్ఐ గిరి, ఇరిగేషన్, ఎస్ఈబీ, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పోర్టు సందర్శన



ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం ఫంక్వాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ప్రమేశ్వర్ ఫంక్వాల్ మంగళవారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించారు. ఆయనతో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వై.నాగేంద్రబాబు, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఉన్నారు. వీరికి పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు పోర్టులో రైల్వే సైడింగ్స్‌ను తనిఖీ చేశారు. ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్, ఇతర నిర్వహణ అంశాలను విచారించారు. అనంతరం విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు, రైల్వే జనరల్ మేనేజర్ బృందం పలు ఉపయుక్తమైన అంశాలపై చర్చించారు. రైల్వే లైన్ల ఎలక్ట్రిఫికేషన్, నవీకరణ, ఎక్కువ బోగీల వినియోగం, రైల్వే ద్వారా సరుకు తరలింపు వంటి వివిధ రైల్వే సమస్యలపై సమీక్షించారు. అల్యూమినియం, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ముఖ్యమైన వస్తువుల రవాణాలో పెరుగుదలపై కూడా చర్చించారు.

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు సతీమణికి కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: అకాల మరణం చెందిన హోంగార్డు కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం ఆర్థిక సాయం అందించారు. అలాగే హోంగార్డు సతీమణి బి.రామలక్ష్మికి కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. నగర పోలీస్ శాఖలో హోంగార్డుగా గత 19 ఏళ్లుగా విధులు నిర్వర్తించిన బి.రామకృష్ణ(46) కిడ్నీ ఫెయిల్యూర్‌తో ఈ ఏడాది ఫిబ్రవరి 17వ తేదీన మరణించారు. కాంట్రిబ్యూషన్ ఫండ్ నుంచి సదరు హోం గార్డ్ భార్యకు రూ.6,80,180 చెక్‌ను, ఉద్యోగ నియామక పత్రాన్ని సీపీ చేతుల మీదుగా అందజేశారు.

కొత్త వన్యప్రాణుల రాక నేడు



గ్రీన్ వింగ్డ్ మెకావ్

ఆరిలోవ (విశాఖ) : ఇందిరా గాంధీ జూ పార్కుకు బుధవారం కొత్త వన్యప్రాణులు రానున్నాయి. జంతు మార్పిడి విధానం ద్వారా గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి రెండు జతలు చొప్పున గ్రీన్ వింగ్డ్ మెకావ్, స్కార్లెట్ మెకావ్స్, మిలటరీ మెకావ్స్, మీడియం సలఫర్ క్రెస్టెడ్ కాకాటూ, స్క్విరెల్ మంకీస్, కామన్ మార్మోసెట్‌లు, ఒక జత చొప్పున మీర్‌కాట్, రెడ్ నేక్డ్ వాలబి తదితర వాటిని ఇక్కడకు తీసుకురావడానికి అధికారులు అంగీకారం కుదుర్చుకున్నారు. వీటికి బదులుగా ఇక్కడ నుంచి స్ట్రిప్డ్ హైనా, హాగ్‌డీర్, పెయింటెడ్ స్టార్క్, గరే పెలికాన్, నక్షత్ర తాబేళ్లు, ఘరియల్, జంగిల్ క్యాట్, ధాల్, తోడేలు, గార్ జాతులను అక్కడకు పంపించనున్నారు. గుజరాత్ నుంచి వీటిని విశాఖ జూకి తీసుకొచ్చేందుకు నాలుగు రోజుల కిందట సిబ్బంది అక్కడకు బయలుదేరి వెళ్లినట్లు జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ) డి.మంగమ్మ మంగళవారం తెలిపారు. కొత్త వన్యప్రాణులతో సోమవారం సాయంత్రం అక్కడ బయలుదేరారని, బుధవారం సాయంత్రానికి విశాఖ చేరుకుంటారని వెల్లడించారు.

కిడ్నీ వ్యవహారంలో ఇద్దరిపై కేసు నమోదు

సీతమ్మధార (విశాఖ) : కిడ్నీలు ఏర్పాటు చేస్తానంటూ చెప్పి రూ.10 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో వైద్యురాలు వాణి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ అనిల్‌పై ద్వారకా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కిడ్నీల మార్పిడి వ్యవహారంలో మురళీనగర్‌కు చెందిన సత్యనారాయణ గోపి వద్ద అనిల్ రూ.10 లక్షల వరకు తీసుకుని.. తర్వాత స్పందించలేదు.

దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ ధర్మేంద్ర డాక్టర్ వాణి, అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్' ఎన్నికలు వాయిదా

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో గందరగోళం నెలకొంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో 250 మంది సభ్యులు హాజరయ్యారు. అయితే సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. ప్రతీ రెండేళ్లకు ఓసారి ఈ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ పదవీ కాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఫిషింగ్ హార్బర్‌లోని మర పడవల సంఘం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముందుగా రెండేళ్ల అకౌంట్లను ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. తర్వాత ఎన్నికల ప్రక్రియలో భాగంగా వాసుపల్లి జానకీరామ్, మైలపల్లి లక్ష్మణరావు, సురపతి నర్సింగరావు, మట్టారాజు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. తదనంతరం జరిగిన పరిణామాలతో వాసుపల్లి జానకీరామ్, సురపతి నర్సింగరావు మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. యూనియన్ హాలులో నచ్చిన అభ్యర్థి పుస్తకంపై సంతకం చేయాలని ఎన్నికల నిర్వాహకులు సభ్యులకు సూచించారు. అయితే ఇందుకు సభ్యుల నుంచి స్పందన రాలేదు. ఆ తర్వాత ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై చర్చ మొదలైంది. చేతు లెత్తే విధానంలో ఎన్నికలు నిర్వహించాలా? రహస్య బ్యాలెట్ నిర్వహించాలా అనే దానిపై సభ్యుల అభిప్రాయాలు సేకరించారు. అయితే ఎక్కువ మంది సభ్యులు రహస్య బ్యాలెట్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాధ్యం కాదని పోలీసులు వాయిదా వేశారు. బోటు యజమానులు, సభ్యుల వివరాలను మత్స్యశాఖ జేడీ ద్వారా సేకరిస్తామని, ఆ తర్వాత ఎన్నికల తేదీ ప్రకటిస్తామని పోలీసులు వెల్లడించారు. వన్‌టౌన్ సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

1400 లీటర్ల సారా పులుపు ధ్వంసం

పాయకరావుపేట మండలంలో గల గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి మంగళవారం 1400 లీటర్లు నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే పులుపును పారబోసి, బట్టీలను, బెల్లం డ్రమ్ములను ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది ఎం.శంకరరావు, టి.లోవరాజు పాల్గొన్నారు.



బెల్లం పులుపును నిల్వ చేసిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబి అధికారులు

పాము కాటుతో వ్యక్తి మృతి

నర్సీపట్నం : పాము కాటుకు గురైన వ్యక్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలివి. మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం బీసీ కాలనీకి చెందిన అనకాపల్లి శ్రీనివాసరావు(45) ఈ నెల 1వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో ఆరుబయటకు బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో పాము కాటేసింది. బంధువులు వెంటనే సమీపంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు



సతీష్ కుమార్(ఫైల్)

యలమంచిలి రూరల్ : పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన యువకుడు సున్నం సతీష్ కుమార్(38) అదృశ్యమైనట్టు తల్లి రాజా నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు విలేకరులకు తెలిపారు. సోమవారం నుంచి యువకుడు కనిపించకపోవడంతో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడి కుటుంబ సభ్యులు పట్టణంలోని భవనం వీధిలో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సముద్ర ఉత్పత్తుల రవాణాలో విశాఖ టాప్

- వరుసగా రెండో ఏడాది విశాఖ పోర్టు దేశంలోనే నంబర్‌వన్
- ఈ వాణిజ్య సంవత్సరంలో 3,14,199 టన్నుల ఎగుమతులు
- రూ.17,983 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తుల నిర్వహణ
- పక్క రాష్ట్రాల చూపు కూడా విశాఖ పోర్టు వైపే
- ఎక్కువగా అమెరికా, చైనా, యూఏఈ తదితర దేశాలకు ఎగుమతులు

సాక్షి, విశాఖపట్నం: నౌకా నిర్మాణ కేంద్రంగా, తూర్పు నౌకాదళ ప్రధాన స్థావరంగా ఖ్యాతిగడించిన విశాఖ సిగలో మరో కీర్తికిరీటం చేరింది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో విశాఖపట్నం పోర్టు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచింది. వరుసగా రెండో ఏడాది కూడా ఈ రికార్డును దక్కించుకుంది. అవసరాలకనుగుణంగా సామర్థ్యాన్ని పెంచుకుంటున్న విశాఖ పోర్టు అథారిటీ సరకు రవాణాలో సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ఈ ఏడాది ఏకంగా రూ.17,983 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసింది. విశాఖ పోర్టు ఓవైపు మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులను శరవేగంగా చేపడుతోంది. మరోవైపు కార్గో రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తద్వారా దేశంలో మేజర్ పోర్టుల్లో నంబర్‌వన్‌గా నిలిచేందుకు అడుగులు వేస్తోంది.

ఎగుమతుల్లో అత్యధిక వాటా..

సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా) నివేదికల ప్రకారం.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలోనే విశాఖపట్నం పోర్టు అత్యధిక వాటాను కలిగి ఉంది. 2023–24 వాణిజ్య సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోర్టుల నుంచి రూ.60,523.89 కోట్ల విలువైన 17,81,602 మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయి. ఇందులో ఒక్క విశాఖపట్నం పోర్టు నుంచే రూ.17,983 కోట్ల విలువైన 3,14,199 మెట్రిక్ టన్నులను ఎగుమతి చేయడం విశేషం. 2022–23లో దేశవ్యాప్తంగా రూ.63,969.14 కోట్ల విలువైన 17,35,286 మెట్రిక్ టన్నులను ఎగుమతి చేశారు. ఇందులో విశాఖ పోర్టు నుంచి రూ.16,876.93 కోట్ల విలువైన 2,64,214 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులున్నాయి.

విశాఖ వైపు పక్క రాష్ట్రాల చూపు..

పోర్టు పక్కనే ఫిషింగ్ హార్బర్.. దానికి ఆనుకుని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు ఎక్కువ సంఖ్యలో ఉండటమే విశాఖ పోర్టు మొదటి స్థానంలో ఉండటానికి ప్రధాన కారణం. దీంతోపాటు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందించిన ప్రోత్సాహకాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయి. విశాఖ సమీప సముద్ర తీరంలో నాణ్యమైన మత్స్య, సంబంధిత ఉత్పత్తులు లభిస్తున్నాయి. దీంతోపాటు ఎగుమతులకు సరైన సౌకర్యాలు కూడా ఉండటంతో సమీప రాష్ట్రాలు కూడా విశాఖ వైపు మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యంగా ఒడిశాకు చెందిన ఎగుమతిదారులు కూడా విశాఖ పోర్టుపైనే ఆధారపడుతుండటం కలిసొస్తున్న అంశంగా మారింది. ఈ కారణంగానే మహారాష్ట్ర, కొచ్చి, కోల్‌కతా పోర్టులను వెనక్కినెట్టి.. విశాఖపట్నం పోర్టు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో నంబర్‌వన్‌గా నిలిచింది.

ఎగుమతుల ఫలితాలిలా..

పోర్టు	2022–23లో ఎగుమతుల విలువ (రూ.కోట్లలో)	2023–24లో ఎగుమతుల విలువ (రూ.కోట్లలో)
విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)	16,876.93	17,983.99
కొచ్చి	7,550.48	6,120
జేఎన్‌పీటీ (ముంబై)	5,892.69	6,395.70

సరకు రవాణాలోనూ సత్ఫలితాలు

ఎగుమతులను ప్రోత్సహించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ సహకారం.. సరకు రవాణాలో సత్ఫలితాలను అందించాయి. విశాఖపట్నం పోర్టులో 32 బెర్తులుండగా.. సమీపంలోని గంగవరం పోర్టులో 9 బెర్తులున్నాయి. ఇందులో మొత్తం 23 బెర్త్‌ల ద్వారా కార్గో కంటైనర్ ఎగుమతులు జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఎక్కువగా అమెరికా, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), దక్షిణ కొరియా, ఇటలీ, వియత్నాం, జపాన్, కెనడా దేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. చానల్స్, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి సైతం ఆదాయం ఆర్జించేలా విశాఖ పోర్టు మార్గాలను అన్వేషిస్తోంది. అన్ని అంశాలను సద్వినియోగం చేసుకుంటూ విశాఖ పోర్టు జోరు కొనసాగిస్తోంది.

క్లుప్తంగా

5న వృద్ధుల సమావేశం

అనకాపల్లి : జిల్లా గ్రామీణ వయో వృద్ధుల ప్రజా సంక్షేమ సంఘ సమావేశం ఈ నెల 5న స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కాంద్రేగుల అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి జిల్లాలోని వృద్ధులు హాజరు కావాలని ఆయన కోరారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లు చేయించుకున్న వారితో రాజేష్, అనిల్

అనకాపల్లి : స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు రోటరీ అధ్యక్షుడు సారిపల్లి రాజేష్ తెలిపారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో 41 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా 8 మందిని ఎంపిక చేసి, అన్ని పరీక్షల తర్వాత ఐవోఎల్ కంటి వైద్యులు కె.మల్లేశ్వరరావు ఈ ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ అనంతరం 5 రోజులకు సరిపడ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోగులు, నేత్ర వైద్య సహాయకురాలు పి.దేవి పాల్గొన్నారు.

ఘనంగా తుంపాలమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: మండలంలోని అచ్చెర్ల గ్రామంలో కొలువుదీరిన తుంపాలమ్మ వారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక భక్తులు తరలి వచ్చారు. గ్రామంలో అమ్మవారి ఘటాలను డప్పులతో సంప్రదాయంగా ఊరేగించిన అనంతరం అమ్మవారి ఆలయానికి చేర్చి, పూజలు చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. జనసేన నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, టీడీపీ నాయకులు కడింశెట్టి నరసింగరావు, నిమ్మదల సన్యాసినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 64 బెల్లందిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,350	5,350
రెండో రకం	3,800	4,100
మూడోరకం	3,550	3,900

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
హరోంహర	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 85 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 357 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అస్తవ్యస్తంగా.. వరద కాలువలు

మండలంలో వరద కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో వర్షా కాలంలో ఆయకట్టు భూములతో పాటు పల్లపు గ్రామాల్లో ముంపు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తుమ్మపాల, మార్టూరు, శంకరం, రేబాక, బట్లపూడి, కొప్పాక, అనకాపల్లి నార్త్, సౌత్ ప్రాంతాల్లో సాగునీటి కాలువల పరిధిలో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీని పరిధిలో భారీ వర్షాలు కురిసిన సమయంలో పంట పొలాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని వరద నీటిని తరలించేందుకు వరద కాలువలు ఉన్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వరద కాలువలు గుర్రపు డెక్క, పూడికతో నిండిపోయాయి.



బొజ్జన్నకొండ సమీపంలో గుర్రపుడెక్క, పూడికతో దర్శనమిస్తున్న పూలి కాలువ



శంకరం పొలాల మధ్య ఏటీ కాలువలో తుప్పలతో నిలిచిపోయిన వర్షపు నీరు

- గుర్రపుడెక్క.. చెత్తా చెదారాలతో నిరుపయోగం
- కాగితాలకే పరిమితమైన పూడికతీత పనుల ప్రతిపాదన
- వరదలొస్తే ముంపు తప్పదని రైతుల ఆందోళన

తుమ్మపాల : పొలాలతో పాటు గ్రామాలను వరద ముంపు నుంచి రక్షించాలంటే వర్షా కాలం ముందే వరద కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. గతంలో ఏటా వర్షాకాలం ముందు అధికారులు కాలువల్లో పూడికతీత చేపట్టేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. వర్షా కాలం సమీపిస్తున్నా వరద నీటి కాలువల్లో పూడిక తీత పనుల విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదు.

కనీసం ఆ ఆలోచన కూడా చేస్తున్నట్లుగా కనిపించడం లేదు. ప్రస్తుతం మండలంలోని ప్రధానమైన వరద కాలువలన్నీ గుర్రపు డెక్క, గడ్డి, చెత్తా చెదారాలతో నిండి రూపురేఖలు కోల్పోయాయి.

పూడిక తీస్తే ముంపు ముప్పు ఉండదు..

మండలంలోని తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, వెంకుపాలెం, సీతానగరం, దిబ్బపాలెం, ఊడేరు, తగరంపూడి, కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాలతో పాటు పలు లోతట్టు కాలనీలు ఏటా వర్షా కాలంలో ముంపునకు గురవుతుంటాయి. ఈ పరిస్థితి తలెత్తకుండా అధికారులు స్పందించి వరద కాలువల్లో పూడిక తీత చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వరి నార్లు వేసి దుక్కులతో పంట పొలాలను సిద్ధం చేసుకున్నారు. వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమయితే గుర్రపు డెక్క, తుప్పలతో నిండి ఉన్న కాలువల ద్వారా సాగు నీరు కూడా అందక పోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకే సరి..

ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేలా ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సమీక్షలు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. రాష్ట్ర స్థాయిలో జలవనరుల శాఖ అధికారులు సమీక్షలు చేసి దాదాపు 15 రోజులు దాటుతున్నా ఎక్కడా కార్యాచరణ కనిపించలేదు. మండలంలో ఒక్క కాలువకు కూడా పూడికతీత పనులు మొదలుపెట్టలేదు. ప్రధానంగా పట్టణానికి ఆనుకుని ఉన్న చెర్లోపల్లి కాలువ, మండలంలోని తుమ్మపాల ఏటీ కాలువలు, శంకరం నుంచి పట్టణంలో సౌత్-2 ఆవ భూముల వరకు విస్తరించిన పూలి కాలువ, ఎల్లయ్య కాలువ, దొంగ గెడ్డ వంటి వాటికి పూడిక తీత పనులకు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆదేశాల కోసం చూస్తున్నాం..



మండలంలో అన్ని కాలువలకు పూడిక తీత చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. షట్టర్ల మరమ్మతులకు కూడా నివేదికలిచ్చాం. ఆదేశాలు రాగానే పనులు ప్రారంభించి పంటలకు సాగునీరు అందించే చర్యలు చేపడతాం. – హనుమంతరావు, ఏఈ, నీటి పారుదల శాఖ, అనకాపల్లి

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం



గొలగాంలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ నరసింహారావు, వైద్య సిబ్బంది



కోడూరులో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు నజరత్ సమీమ్ తదితరులు

అనకాపల్లి : ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలని గొలగాం గ్రామ సర్పంచ్ నరసింహారావు అన్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలోని గొలగాం, గోపాలపురం, పాపయ్యసంతపాలెం, తుమ్మపాల-3, కోడూరు గ్రామాల్లో మంగళవారం సీజనల్ వ్యాధులపై వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఆగస్టు 31 వరకు డయేరియా మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. చిన్నపాటి జ్వరమే కదా అని అశ్రద్ధ చేసినట్లయితే ప్రాణానికే హాని కలుగుతుందన్నారు. కోడూరులో తుమ్మపాల వైద్యురాలు ఎస్‌ఏ నజరత్ సమీమ్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద గల మురుగు కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంబూషియా చేప పిల్లలను బావులు, కుంటల్లో వదిలినట్లయితే దోమలు వృద్ధి చెందవన్నారు. నీటిలోని దోమల లార్వాలను ఈ చేపలు తిని బతుకుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి..

కశింకోట : డయేరియా వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు. రమేష్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం డయేరియా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా వ్యాధి రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



తాళ్లపాలెంలోని బాలికల గురుకులంలో డయేరియాపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ రమేష్

ఆహారం తీసుకునేటప్పుడు చేతులు తప్పనిసరిగా శుభ్రపరచుకోవాలన్నారు. డయేరియా వ్యాధి బారిన పడిన వారు లీటర్ కాచి చల్లార్చిన నీటిలో ఓఆర్‌ఎస్ కలిపిన ద్రావణాన్ని తాగాలన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ డయేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎ.వి. సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్‌ఆర్‌కేతు నరసింహారావు, ప్రిన్సిపాల్ జి.గ్రేస్, సీహెచ్‌వో కె. అరుణ, ఏఎన్‌ఎం ఎన్. అన్నమ్మ, ఆరోగ్య కార్యకర్త ఆర్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రకు ఘనంగా ఏర్పాట్లు



వేదిక స్థలాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల: ఈ నెల 7న జరగనున్న శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని గూడ్స్ రోడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాలును దేవదాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. వేడుక ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్రతో పాటు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. త్వరలో ఇక్కడ కల్యాణ మండపం నిర్మించి, ప్రజల శుభకార్యాలకు, శ్రీ జగన్నాథ స్వామి పండగకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం



పరమానందరావును సత్కరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కశింకోట : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన పోతుల పరమానందరావుకు మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పరమానందరావు దంపతులను సత్కరించారు. వైద్యాధికారులు కె. తిరుపతిరావు, యశోద, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఘనంగా వన మహోత్సవం



మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తున్న నరసింగరావు

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని లూపిన్ ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్, యోగా గురువు బుదిరెడ్డి నరసింగరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని తేగాడ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వన మహోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఏపీ జీవ వైవిధ్య మండలి, లూపిన్ ఫార్మా కంపెనీ, శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతను, ఆరోగ్యానికి ఉపకరించే యోగాసనాల గురించి బాలికలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ప్రతినిధులు చక్రవర్తి, జయ, జి.ఎల్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

డ్వాక్రా మహిళలను మోసం చేసిన అధికారులను శిక్షించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం, కొత్తూరు, మూలపేట పంచాయతీ పరిధిలో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద సీపీఎం, ఐద్వా ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు చేసి 6 నెలలైనా అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి మండలం పంచాయతీల పరిధిలో వీవోఏ గ్రూపు సభ్యులకు తెలియకుండా నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచ్‌ల్లో సుమారు రూ.8 కోట్లు అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో వెలుగు సిబ్బంది, బ్యాంకు అధికారులు చేసిన స్కాంపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, బాధితులు జి.సుభాషిణి, నందిక నాగమణి, ఉపమాక లక్ష్మి, బోడి ఝాన్సీ, బొబ్బిలి గాయత్రి, నందిక విజయ, ఆకుల దేవ, ఉప్పాటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

అనకాపల్లి: వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నందున అధికార యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కలెక్టర్ రవిపట్టన్ శెట్టికి మంగళవారం లేఖ రాశారు. గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల మండలాల్లో ఏజెన్సీని ఆనుకొని ఉన్న గ్రామాల్లో ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని పేర్కొన్నారు. జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలను గుర్తించి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో మలేరియా పరీక్ష కిట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేదని, అధికారులు దానిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

ఆశ కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలి



కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

కశింకోట: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశ కార్యకర్తలకు పారితోషికం అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి కోరారు. ఈ మేరకు ఆశ కార్యకర్తలతో కలిసి కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను వేర్వేరుగా కలిసి, మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఆశ కార్యకర్తలకు సబ్బవరం, తదితర ప్రాంతాల్లో రోజుకి రూ.200 వంతున పారితోషికం చెల్లించారని, అలాగే ఇక్కడ కూడా విధులు నిర్వర్తించిన ఆశ కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుపర్తి హైస్కూల్లో గణిత క్లబ్ ప్రారంభం



గణిత క్లబ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఆచారి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో శకుంతలాదేవి గణిత క్లబ్‌ను హెచ్‌ఎం జి.వి.కె. ఆచారి మంగళవారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షునిగా పాలా దుర్గా ప్రసాద్, కార్యదర్శిగా పావని పరమేశ్వరి, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. విశిష్ట సేవలందించిన పదిమంది గణిత శాస్త్ర వేత్తలను వినూత్నంగా ఆటల ద్వారా పరిచయం చేసిన విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా ఆటలు, పాటలు, చిన్న నాటికలు, నమూనాల ద్వారా గణిత బోధన సాగిస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ మూర్తి, పి.సత్యనారాయణమూర్తి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

చోడవరం: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్‌ఎస్ రాజు తెలిపారు. డయేరియా నిర్మూలన మాసోత్సవాలను గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మాసోత్సవాల సందర్భంగా గవరవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా గ్రామ వీధుల్లో ర్యాలీ జరిగింది. డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఇతర సీజనల్ రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును అందిస్తున్న వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్

మాడుగుల రూరల్: ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్‌వీఎస్ఎస్ ప్రసాదుపాత్రుడు తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కేజే పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో చింతాడ పుష్పమ్మకు మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ మాట్లాడుతూ పుష్పమ్మ సేవల్ని కొనియాడారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులతో పాటు బుడబండి రాజు, విశ్రాంత డీపీఎం చిన తిరుపతి, ఆరోగ్య సహాయకుడు పేర్ని శంకర్ తదితర్లు ఆమె అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పమ్మ, ప్రసాద్ దంపతులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక పెద్దలు, పుష్పమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి : రాజ్యాంగ నిబంధనల మేరకు జరిపించాల్సిన గ్రామ సభల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రజలకు కనీస సమాచారం లేకుండా గ్రామ సభ నిర్వహించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభకు మూడు రోజులు ముందుగా గ్రామంలో దండోరా, ప్రధాన కూడళ్లలో పోస్టర్స్ అతికించి ప్రజలకు తెలపాలన్నారు. పంచాయతీలో అవినీతి, అక్రమాలు బయట పడతాయన్న భయంతోనే అధికారులు గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభ నిర్వహించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, మండల సభ్యులు చొక్కాకుల రమణ పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి



అర్లిలో సాగులో ఉన్న కాలీఫ్లవర్ పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కాలీఫ్లవర్ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు ప్రారంభించిన రెండు నెలలకే దిగుబడి రానుండటంతో రైతులు సాగు పట్ల మక్కువ ప్రదర్శిస్తున్నారు. అర్లి, కె.సంతపాలెం, గవరపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, గొల్లలపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట సాగు మొదలై 15 రోజులే అయిందని రైతులు చెప్పారు. ఎకరా పొలంలో పంట సాగుకు దుక్కులు, గొప్పులు, సస్యరక్షణ చర్యలు, కూలీల పెట్టుబడిగా రూ.20 వేల వరకు ఖర్చవుతుందన్నారు. కూరగాయల పంటలకు ప్రస్తుతం ధరలు బాగా ఉండటంతో పంట చేతికి వచ్చాక మంచి లాభాలు పొందగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తి

కశింకోట : మండలంలో పింఛన్ల సొమ్ము పంపిణీ దాదాపు పూర్తి అయిందని ఎంపీడీవో కె. శేషుబాబు తెలిపారు. సోమ, మంగళవారాల్లో 99 శాతం పైబడి పింఛన్ల పంపిణీ పూర్తి అయిందన్నారు. మండలంలో 10,484 మంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఇతర పింఛన్‌దారులుండగా, వారిలో 71 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ కాకుండా మిగిలారన్నారు. వీరిలో 53 మంది మృతి చెందిన వారు కాగా, మిగిలిన 18 మందికి మాత్రం పింఛన్ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, ఇళ్ల వద్ద లేకపోవడం తదితర కారణాల వల్ల వారికి పింఛన్ సొమ్ము పంపిణీ జరగలేదన్నారు. వారు వచ్చి సంబంధిత సిబ్బందిని సంప్రదిస్తే బుధవారం పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.